నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 19 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



గుడిపేటలో ఆరబోసిన ధాన్యం



నంనూర్‌లో తూర్పార పట్టే మిషిన్‌కు విద్యుత్ సౌకర్యం లేక.. అదే మిషిన్‌పై నిలబడి గాలికి తూర్పార పడుతున్న రైతు

# కొనుగోళ్ల పేరిట కొర్రీలు

- తప్ప, తాలు ఉందని లారీల లోడ్ దించుకోని మిల్లర్లు
- మూడు రోజులుగా అన్‌లోడ్ చేయని వైనం.. అవస్థల్లో అన్నదాతలు
- తూర్పార పట్టేందుకు యంత్రాలు కరువు
- వర్షాలు పడకముందే కొనాలని రైతన్నల వేడుకోలు
- 'నమస్తే తెలంగాణ' పరిశీలనలో వెలుగుచూసిన నిజాలు

## ధాన్యం తూర్పార పడితేనే తూకం వేస్తామంటున్న నిర్వాహకులు



టీకానపల్లిలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేసి లోడ్ చేయకుండా ఉన్న ధాన్యం బస్తాలు

మంచిర్యాల, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతాంగానికి చేదు అనుభవమే ఎదురవుతున్నది. తప్పతాలు ఉందని.. తూర్పార పడితేనే తూకం వేస్తామని.. ఇలా సవాలక్ష కొర్రీలు పెడుతుండగా, అన్నదాతలు అవస్థలు పడాల్సి వస్తున్నది. కాగా,శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని పలు కొనుగోలు సెంటర్లను 'నమస్తే ' పరిశీలించ గా, ఆయాచోట్ల కర్షకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించింది.

### తేమ శాతం ఉన్నప్పటికీ..

మంచిర్యాల జిల్లాలోని కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం 'నమస్తే తెలంగాణ' పరిశీలించింది. గుడిపేట, నంనూర్, టీకానపల్లి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి ఉన్న కుప్పలు కనిపించాయి. నిబంధనల మేర తేమ శాతం ఉన్నప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో ఆరబోసే ఉంచారు. దీనిపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులతో మాట్లాడగా.. మూడు రోజుల క్రితం గుడిపేట, నంనూర్ సెంటర్ల నుంచి నాలుగు లారీలు మందమర్రి అందుగులపేటలోని ఓ రైస్ మిల్లుకు వెళ్లాయని చెప్పారు. అవి ఇప్పటి దాకా అన్‌లోడ్ కాలేదని, అందుకే తూకం వేయడం లేదన్నారు. ఇక తప్ప, తాలు ఎక్కువగా ఉందని మిల్లర్.. లారీకి 15 బస్తాలు కట్ చేస్తామంటున్నాడని, అదేదో ముందే చెప్పి ఉంటే ఇక్కడే తాలు, తప్ప తీసేసి పంపేవాళ్లమని రైతులు అంటున్నారు. తూర్పార పడితేనే తూకం వేస్తామని నిర్వాహకులు సైతం చెబుతున్నారని, కోతలు కోసి ఇక్కడికి తెచ్చిన ధాన్యానికి మాయిశ్చర్ వచ్చాక చెబితే ఏం చేసేదని వాపోతున్నారు. రెండు, మూడు రోజులుగా ఉదయం, సాయంత్రం మబ్బులు పడి ఉంటున్నాయని. వర్షం పడితే ఇన్ని రోజులు పడ్డ కష్టమంతా వృథా అవుతుందంటున్నారు. తూర్పార పట్టాకే తూకం వేస్తామని ముందే చెబితే అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకునే వాళ్లమంటున్నారు. ఎకరం ధాన్యం తూర్పార పడితే తప్ప, తాలు రెండు కిలోలు కూడా రావడం లేదని, అంత మంచి ధాన్యాన్ని మాయిశ్చర్ వచ్చాక, తూర్పార పట్టమని చెప్పడం ఎంత వరకు న్యాయమో అధికారులే చెప్పాలంటున్నారు. నిబంధనలకు మేర తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ఇకపై వచ్చే ధాన్యానికి తూర్పార పట్టడం తప్పనిసరి చేయాలని వారు కోరుతున్నారు. వర్షాలు రాకముందే ధాన్యం మిల్లులకు చేరేలా చూడాలంటున్నారు. అంతే తప్ప.. తప్ప, తాలు ఉందని మూడు రోజులుగా మిల్లర్ ధాన్యం దించుకోకపోడం, మిగిలిన రైతుల ధాన్యం తూకం వేయకుండా ఇబ్బందులు పెట్టడం ఏమిటని వాపోతున్నారు. కాగా, మంచిర్యాల జిల్లాలో ఈ సీజన్ ధాన్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం 319 సెంటర్లను ఏర్పాటు చేసింది. ఏ గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధరను నిర్ణయించింది.

### తూర్పార పట్టేందుకు ఇబ్బందులు..

నిబంధనల ప్రకారం తప్ప, తాలు లేకుండా తెచ్చే ధాన్యానికి మిల్లర్లు కోత పెట్టడానికి అవకాశం ఉండదు. ఇది మంచి విషయమే.. కానీ కొనుగోలు కేంద్రాల్లో తూర్పార పట్టేందుకు అవసరమైన యంత్రాల కొరత ఉందని రైతులు చెబుతున్నారు. నిన్న లక్షెట్టిపేటకు వెళ్లి వచ్చామని.. అక్కడ యంత్రం దొరకలేదని.. ఈ రోజు కూడా వెళ్తామని టీకానపల్లి రైతులు చెప్పారు. యంత్రాలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నామంటున్నారు. జిల్లాలో 319 ధాన్యం కొనుగోలు సెంటర్లు ఉంటే.. 95 ఆటోమెటిక్ యంత్రాలను మార్కెటింగ్ శాఖ మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి దాకా 50 యంత్రాలు వచ్చాయి, మరో 45 యంత్రాలు రావాల్సి ఉంది. జిల్లాలో ఇంకా ధాన్యం కోతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో 95 యంత్రాలు ఏ మేరకు సరిపోతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ అధికారులు చెప్పినట్లు తూర్పార పట్టి తప్ప, తాలు తీసేసి పంపించాక కూడా మిల్లర్లు కోత పెడితే ఏం చేయాలో అధికారులే చెప్పాలంటున్నారు. ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.



### వర్షం వస్తే ఆగమే..

*నేను ఐదెకరాల్లో వరి సాగు చేసిన. అమ్మేందుకు కొనుగోలు కేంద్రానికి తెచ్చి వడ్లు పోసిన.. ఇప్పుడు వడ్లను తూర్పార పట్టమని చెబుతున్నరు. మీరే చూడండి ధాన్యం ఎంత మంచిగున్నదో. ఇప్పుడే ఓ ఎకరం ధాన్యం తూర్పార పట్టిన. రెండు కిలోల తప్ప, తాలు కూడా రాలే. గింత మంచి ధాన్యాన్ని తూర్పార పట్టమని చెబుతున్నరు. గతంలో ఎప్పుడూ ఇలా కాలేదు. ఐదెకరాలు ఒక్కడిని ఎంతగనం తూర్పార పట్టాలి. ఓ మిషన్ తెచ్చారు. అది కూడా కరెంట్ లేక పని చేస్తలేదు. మళ్లీ ఏదో ఆటోమెటిక్ మిషన్ వస్తదంటున్ను. అది వచ్చేదెప్పుడు, మేం పట్టేది ఎప్పుడో అర్థమైతలేదు. వర్షం వస్తే ఆగమవుడు తప్ప ఏం లేదు. నిన్న పోయిన లారీకే 20 బస్తాలు కట్ చేసుకున్నరట. అంత కటింగ్ ఎందుకో అర్థమైతలేదు. సర్కారోళ్లు ముందే చెప్పినా పొలం దగ్గరే పట్టుకొని తెచ్చేటోళ్లం. ఇకనైనా ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలి.*
**- రావిశెట్టి రాజయ్య, నంనూర్**

### రెండు రోజులైంది..

*నేను నాలుగెకరాల్లో వరి వేసిన. వర్షాలు వచ్చేలా ఉన్నాయని ముందే కోసిన. సెంటర్‌కు తీసుకువచ్చిన. ధాన్యం మాయిశ్చర్ వచ్చి రెండు రోజులు అవుతుంది. ఇప్పటి దాకా కాంటా పెట్టలేదు. అడిగితే తూర్పార పట్టమంటున్నరు. వేరే రైతులకు చెందిన ఓ లోడ్ ధాన్యం తూకం వేసి తూర్పార పట్టలేదని ఇక్కడే ఉంచారు. మూడు రోజుల క్రితం మిల్లుకు పోయిన ధాన్యమే ఇంకా దిగలేదు అంటున్నరు. వర్షాలు పడి పంట ఆగం కాకముందే ధాన్యం కొనుగోలు చేయాలి. మాయిశ్చర్ వచ్చిన ధాన్యం వెంటనే తీసుకుపోతే మాకు టెన్షన్ ఉండదు.*
**- తాడు రవీందర్, టీకానపల్లి**



### ధాన్యాన్ని క్లీన్ చేస్తే రైతులకే లాభం

*సమస్యలు మా దృష్టికి వచ్చాయి. నిబంధనలు అనుసరించి ధాన్యాన్ని క్లీన్ చేయాల్సిందే. లేకపోతే మిల్లర్లు కట్ చేస్తామనే చెప్తారు. అదే క్లీన్ చేస్తే ఇబ్బంది ఉండదు. రైతులకు అది లాభమే చేస్తుంది. జిల్లాలోని 90 ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వారు తీసుకెళ్లవచ్చు. సెంటర్ నుంచి మరో సెంటర్‌కు కూడా తీసుకెళ్లవచ్చు. కరెంట్ లేకపోయినా ట్రాక్టర్‌తో నడిపించవచ్చు. ప్రస్తుతానికి ఇబ్బందులు ఏమీ లేవు. క్లీన్ చేసి తీసుకువచ్చాక కూడా దించుకోకవడం అన్నది ఏమీ ఉండదు. ఈ సారి ఎలాగైనా క్లీన్ చేసిన ధాన్యామే మిల్లులకు పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులకు చేసే విజ్ఞప్తి అది ఒక్కటే. గతంలోనూ కలెక్టర్, అదనపు కలెక్టర్లు సమావేశాలు నిర్వహించి మరీ రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.*
**- బ్రహ్మ రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి**



# దేవుడి భూములకు ఎసరు!

## అన్యాక్రాంతమవుతున్న కేశవనాథ స్వామి ఆలయ మాన్యం

- గోవింద్‌పూర్‌లో ఇప్పటికే ఎకరం 18 గుంటలు ఆక్రమణ
- ఆ స్థలాల్లోనే వెలుస్తున్న పక్కా భవనాలు.. ఇందిరమ్మ ఇండ్లు
- చక్రం తిప్పుతున్న నాయకులు, రియల్టర్లు
- చోద్యంచూస్తున్న జిల్లా దేవాదాయ శాఖ అధికారులు

> *ఆసిఫాబాద్‌లోని కేశవనాథ స్వామి ఆలయ భూములకు రక్షణ కరువైంది. కొందరు ఏకంగా దేవుడి మాన్యానికే ఎసరు పెట్టడం ఆందోళన కలిగిస్తున్నది. మొదట తాత్కాలిక నిర్మాణాలకు అనుమతులు తీసుకొని.. ఆపై ఆ స్థలాల్లోనే పక్కా భవనాలు.. ఇందిరమ్మ ఇండ్లు కట్టడం గందరగోళానికి దారితీస్తున్నది. కొందరు నాయకులు, రియల్టర్లు దళితులను అడ్డం పెట్టుకొని భూ స్వాహాకు చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తుండగా, సంబంధిత అధికారులు చోద్యం చూడడం విమర్శలకు తావిస్తున్నది.*



ఆక్రమణలు అడ్డుకోవడంతో దేవాదాయ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు(ఫైల్)

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కేశవనాథ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆసిఫాబాద్ మండలం జనకాపూర్ శివారులోని సర్వే నంబర్ 80/ఎ,80/బీ, 81,82,83,84,85,94లలో కేశవనాథ స్వామి ఆలయానికి సంబంధించిన భూమి 89 ఎకరాల 13 గుంటలు ఉంది. ఇందులో గోవింద్‌పూర్ గ్రామానికి ఆనుకొని.. సర్వే నంబర్ 83లో 8 ఎకరాల 22 గుంటలుండగా, ఇందులో ఎకరం 18 గుంటలు ఆక్రమణకు గురైంది. యేటా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు కోసం వేలం నిర్వహిస్తారు. తద్వారా వచ్చిన సొమ్మును దేవాదాయ శాఖ , ఆలయ కమిటీ ఖాతాలో జమ చేస్తారు. యేటా వేలం ద్వారా ఆలయానికి సుమారు రూ. 20 లక్షల దాకా ఆదాయం వస్తుండగా, ఆలయ భూములు రక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

### తాత్కాలిక నిర్మాణానికి అనుమతులు... ఆపై పక్కా భవనాలు..

కేశవనాథ ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 83లో 8 ఎకరాల 22 గుంటలుండగా, గోవింద్‌పూర్‌కు చెందిన కొందరు ఎకరం 18 గుంటల్లో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో దేవాదాయశాఖ అధికారులు గతంలో భూమి సర్వే చేయించి.. ఆక్రమించిన వారికి



జనకాపూర్ శివారులోని గోవింద్‌పూర్ వద్ద కేశవనాథ స్వామి ఆలయ భూమి

నోటీసులు సైతం అందజేశారు. దీంతో వారంతా పలువురు రాజకీయ నాయకులను ఆశ్రయించారు. 2001లో ఎకరం 18 గుంటల్లో తాత్కాలిక షెడ్లు నిర్మించుకున్న వారంతా యేటా సదరు భూమికి రెంట్ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ, ఏ ఒక్కరూ రెంట్ కట్టడం లేదు. తాత్కాలిక షెడ్ల నిర్మాణం కోసం ఒప్పందం కుదుర్చుకున్న పలువురు పక్కా భవనాలు కడుతుండగా, ఇటీవల అధికారులు వాటిని అడ్డుకున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

### ఆలయ భూముల్లో వెలుస్తున్న ఇందిరమ్మ ఇండ్లు

ప్రభుత్వం గూడులేని నిరుపేదలకు ఇండ్లు కట్టించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నది. ఈ మేరకు ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. గ్రామానికి దాదాపు 187 ఇండ్లు మంజూరు చేయగా, ప్రస్తుతం కొన్ని బేస్‌మెంట్ దశకు చేరుకున్నాయి. దేవాదాయ శాఖకు చెందిన భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండగా, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు బుధవారం అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ లబ్ధిదారులు స్థలానికి సంబంధించిన సరైన పత్రాలు లేకున్నా ఇంటి నిర్మాణానికి పూనుకోవడం.. అధికారులు అనుమతులివ్వడం విమర్శలకు తావిస్తున్నది. ఇట్టి నిర్మాణాలపై గ్రామస్తులను వివరణ కోరగా, తాము 20 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నామని, తమకు ఎలాంటి హక్కు పత్రాలు ఇవ్వలేదని, భూమికి హద్దులు చూపించలేదని వారు తెలిపారు.

### ఆక్రమణల వెనుక హస్తమెవరిది..?

కేశవనాథ ఆలయ భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాల వెనుక ఎవరి హస్తముందనే చర్చ సాగుతున్నది. దళితులను అడ్డం పెట్టుకొని కొంతమంది నాయకులు, రియల్టర్లు రంగంలో దిగి చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తున్నది. దేవాదాయశాఖ భూములు అన్యాక్రాంతమవుతున్నప్పటికీ అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం దారుణమని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆలయ భూముల్లోని అక్రమ కట్టడాలను తొలగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### సర్వే కోసం ఏడాదిగా ఎదురుచూపులు

కేశవనాథ ఆలయ భూముల సర్వే కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు పెట్టి ఏడాదిగడుస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాదాయశాఖకు చెందిన భూములకు కొలతలు చేపట్టి సరిహద్దులు పెట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భక్తితో ఇచ్చిన దేవాలయ భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందంటున్నారు.



దేవాలయ స్థలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

### ఆక్రమణల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



*కేశవనాథ ఆలయానికి సంబంధించిన భూముల్లో కొందరు నిర్మాణాలు చేపడుతున్నట్లు సమాచారం రావడంతో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బుధవారం పరిశీలించాం. ఇప్పటికే దాదాపు ఎకరం 18 గుంటల భూమి అన్యాక్రాంతమైంది. 2021లో అక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని నిర్ణీత రుసుము చెల్లిస్తామని, ఎలాంటి పక్కా నిర్మాణాలు చేయబోమని చెప్పారు. కానీ రుసుము చెల్లించకపోగా ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల పేరిట పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నాం. పై నుంచి ఆదేశాలు రాగానే తదుపరి కార్యాచరణ చేపడుతాం. ఆలయ భూముల పరిరక్షణకు తప్పకుండా కృషి చేస్తాం.*
**- వేణుగోపాల్ గుప్తా, ఆలయ కార్యనిర్వాహక అధికారి**

# మళ్లీ కేసీఆర్ పాలనే కోరుకుంటున్నరు

- రజతోత్సవ సభకు గులాబీ దండు కదం తొక్కాలి
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కొండాపూర్ యాపలో సన్నాహక సమావేశం

కాసిపేట, ఏప్రిల్ 18 : రాష్ట్ర ప్రజలంతా మళ్లీ కేసీఆర్ పాలనే రావాలని కోరుకుంటున్నరని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండలం కొండాపూర్ యాపలో రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి విడుదల చేశారు. అనంతరం సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు గులాబీ దండు కదంతొక్కాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య. మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ అజ్మీర తిరుపతి, మాజీ ఉప సర్పంచ్‌లు బోయిని తిరుపతి, సూర్య ప్రకాశ్, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, చింతల భీమయ్య, ఏనుగు సుధాకర్ రెడ్డి, మంజులారెడ్డి, రాంటెంకి వాస్‌దేవ్, లంక లక్ష్మణ్, పెంద్రం హన్మంతు, జాడి రాంచందర్,కైలాస్, దుర్గం సాగర్, వెల్డి శ్రావన్, బూడిద రమేశ్, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండాపూర్ యాపలో పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ శ్రేణులు



102 వాహనంలో నుంచి దిగుతున్న సిబ్బంది

# శుభకార్యానికి 'అమ్మ ఒడి'

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 18 : మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అమ్మ ఒడి(102 అంబులెన్స్) వాహనాన్ని ఓ వ్యక్తి వ్యక్తిగత కార్యక్రమానికి వాడుకున్నాడు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన అమ్మఒడి వాహనాన్ని సిబ్బంది తమ బంధువు ఇంట్లో జరిగిన శుభకార్యానికి తీసుకెళ్లారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం సబ్బేపల్లిలో అమ్మఒడి అంబులెన్స్ కనిపించగా, యువకులు ఫొటో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సొంత అవసరాలకు 102 వాహనాన్ని వాడుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి సీతారాంను వివరణ కోరగా, వ్యక్తిగత అవసరాలకు 102 వాహనాన్ని వినియోగించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.